క్లుప్తంగా

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్ఐ కడలి కరుణ పేర్కొన్నారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో మంగళవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ముందుగానే సరైన అవగాహన పెంచుకొని జీవితాలను చక్కదిద్దికోవాలని ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.కోటయ్య, నవజీవన్ బాలభవన్ నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ కె. ప్రియాంక, ఎస్కే నజ్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరకాండ పారాయణం



విజయవాడ కల్చరల్: సుందరకాండ పారాయణం సర్వశ్రేయోదాయకమని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. స్నేహాలయ సేవా సమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని వినాయక ఉత్సవంలో భాగంగా మంగళవారం సుందరకాండ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరకాండ రామాయణంలోని ప్రధాన సన్నివేశమని చెప్పారు. పారాయణ ప్రవచకులు పసుమర్తి శివకుమార్ మాట్లాడుతూ సుందరకాండను రామాయణ బీజకాండమని కూడా అంటారని చెప్పారు. సుందరకాండను నిత్యం పారాయణం చేయాలని సూచించారు. భక్తులచే పారాయణం చేయించారు. అనంతరం నిర్వాహకులు శివకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కేవీ రెడ్డి, మురళి, శ్రీనివాసరావు, దుర్గా హరిప్రసాద్, దుర్గాప్రసాద్, కొల్లూరి లక్షణ్‌గుప్తా పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ నిందితుడికి జైలు, జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితుడికి న్యాయస్థానం ఏడు నెలల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధించింది. వివరాల ప్రకారం సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాది తన కుటుంబంతో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ నివశిస్తున్నాడు. కాగా గతేడాది మే 20న రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన చేతిలో రాయి చూపించి చంపుతానని బెదిరించి తన జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పోయినట్లు సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. నాటి ఏఎస్ఐ ఐ.పరమేశ్వరరావు దర్యాప్తు చేసి, గతేడాది మే 22న నిందితుడు చుట్టుగుంటకు చెందిన ఉప్పు దుర్గారావును అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం చార్జ్‌షీట్ ఫైల్ చేయగా, విచారణ అనంతరం దుర్గారావుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి గండికోట దేవిక నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.గంగాధర్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్ఆర్ పేట ఇన్‌స్పెక్టర్ ఆలీ, సీఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో ఐదుగురి సాక్షులను విచారించారు.

స్వయం కృషితోనే ఉన్నత శిఖరాలు



విజయవాడ కల్చరల్: స్వయం కృషితోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీవీఆర్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు రామ్మోనరావు అన్నారు. బీవీఆర్ ఆర్కెస్ట్రా, భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం ఆపాత మధురాల సినీ సంగీత విభావరి నిర్వహించారు. రామ్మోహనరావు మాట్లాడుతూ గాయకులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. కళాపోషకుడు నవనీతం సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు సినిమాకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చిన మహనీయులు సదా స్మరణీయులన్నారు. గాయకులు సుశీల్‌కుమార్, భారతి, సయ్యద్ ఆలీ, రూపశ్రీ, మల్లాది స్వాతి, శివశర్మలు తెలుగు పాటలను ఆలపించారు. గాయకులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు బి.హరీష్, చింతకాయల చిట్టిబాబు, కె. డేవిడ్‌రాజు, బి.వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు.



మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి, పార్టీ నాయకులు



సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్ వద్ద అన్నదానంలో మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజరెడ్డి

సంక్షేమ రథసారథి వైఎస్సార్

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు
- వాడవాడలా మహానేత వర్ధంతి కార్యక్రమాలు
- విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులు



గిరిపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, కుక్కల అనిత తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపిన సంక్షేమ రథసారథి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మంగళవారం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్లాది విష్ణు పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ నిరుపేదలకు సైతం కార్పొరేట్ విద్య, వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడటం జరిగిందని అన్నారు. అలాగే వ్యవసాయం దండగ అన్న మాట నుంచి వ్యవసాయం పండగ అనే స్థాయికి ఆ రంగాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారని ప్రజలకు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు కొండాయిగుంట మల్లేశ్వరి, రాజారమేష్, శర్వాణీమూర్తి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఝాన్సీ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి వెన్నం రత్నారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణంరాజు, జిల్లా కార్యదర్శి మంద రాము, విజయలక్ష్మి, క్లస్టర్ అధ్యక్షులు పిల్లుట్ల వంశీ, భోగాది మురళి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి మహేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మాతా మహేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్‌కుమార్, నాయకులు పట్టాభి, కాళ్ల ఆదినారాయణ, కనపర్తి కొండ, శ్రీనివాస్, కురిటి శివ, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మధురానగర్, గులాబీతోట ప్రాంతాల్లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పేదల ఆశాజ్యోతి

పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురం ఫుడ్ జంక్షన్ సమీపంలో మంగళవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యాన రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహానేత విగ్రహానికి గౌతంరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన కాలం రాష్ట్రానికి స్వర్ణయుగంగా నిలిచిందని విమర్శకులు సైతం కొనియాడారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని కొనియాడారు. మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి వేదాంతం చైతన్య, నాయకులు బల్లం కిషోర్, వి.వర్మ, గొర్రెల దుర్గాప్రసాద్, గంటా రణదేవ్, సీహెచ్ రమేష్, ప్రభు, వరలక్ష్మి, శంకర్‌రాజు, తిరుపతిరెడ్డి, సుబ్బారెడ్డి, వీరబాబు, శ్రీను పాల్గొన్నారు. అలాగే 30వ డివిజన్ దేవీనగర్ కార్పొరేటర్ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి జరిగింది. కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి మహానేత చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు సీహెచ్ సుబ్బారెడ్డి, కృష్ణ, నారాయణరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, రఫీ, ధనుంజయ్, శ్రీనివాసరెడ్డి, పెద్దబాబు, రాజు, శంకర్ పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని గిరిపురంలోని ఆయన విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత, నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కొమ్ము చంటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా హోటల్ సెంటర్‌లో...

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి ఆధ్వర్యంలో సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లోని ఆమె కార్యాలయం వద్ద మంగళవారం మహానేత వర్ధంతి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్పొరేటర్లు ఉద్దంటి సునీత, యర్రగొర్ల తిరుపతమ్మ, బాలి గోవింద్, శర్వాణీ మూర్తి, కుక్కల అనిత, నాయకులు అంగిరేకుల గొల్లభామ, అలంపూర్ విజయకుమార్, ఈసరపు రాజు, అవుతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు అనిర్వచనీయం

విజయవాడలీగల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, అపర భగీరథుడు వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన సేవలు అనిర్వచనీయమని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ వైఎస్సార్ పేద, బడుగు వర్గాల ప్రజలకు ఎంతో కృషి చేశారని, ఆరోగ్యశ్రీ ద్వారా లక్షలాది పేదలకు ప్రాణదాత అయ్యారని గుర్తుచేశారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత స్థానాలు కల్పించిన గొప్ప ప్రజానేతగా అభివర్ణించారు. మాజీ ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఏపీ ఆర్టీఐ కమిషనర్ అంబటి సుబ్బారావు, బీబీఏ జాయింట్ సెక్రటరీ జి.వరాహ లక్ష్మి, న్యాయవాదులు గౌతమిరెడ్డి, గురునాథం, మతిన్, బూసి సతీష్, పిల్లా రవి వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

సింగ్‌నగర్‌లో...

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులతో కలిసి ఆమె వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు మురళి, రాజు, ఆదినారాయణ, కృష్ణారెడ్డి, బలసాని జగదీష్ పాల్గొన్నారు.

■ 58వ డివిజన్‌లో..

సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఇన్‌చార్జ్ మల్లాది విష్ణు కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, నాయకులతో కలిసి మల్లాది విష్ణు వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ఎ.రవిచంద్ర, అలంపూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

■ డాబాకొట్లు సెంటర్‌లో..

స్థానిక 59వ డివిజన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగిన మహానేత వర్ధంతి కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ఎండీ హాఫీజుల్లా, చింతా చిన్నా, నేరెళ్ల శివప్రసాద్, షేక్ అమిత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక 60వ డివిజన్‌లోని వాంబేకాలనీలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో స్థానిక నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



ఆంధ్రప్రభకాలనీలోని కార్యాలయంలో మహానేత చిత్రపటానికి నివాళులు



న్యూఆర్ఆర్‌పేటలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దేవి



సింగ్‌నగర్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ షాహీనాసుల్తానా

సంక్షేమం అంటే మహానేత వైఎస్సార్ గుర్తుకొస్తారు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపించిన గొప్ప నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ కొనియాడారు. దివంగత వైఎస్సార్ 16వ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు కంట్రోల్ రూం వద్ద వైఎస్సార్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, పూనూరు గౌతంరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి షేక్ ఆసిఫ్, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన వెంకటమహేష్, పార్టీ నాయకులు పాల్గొని మహానేత విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, 108 వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన తర్వాత ఆ విధంగా పరిపాలన చేసిన నాయకుడు వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దివంగత వైఎస్సార్ పాలన ఈ రాష్ట్రానికే ఒక రోల్ మోడల్ అన్నారు. చంద్రబాబు జీవితమంతా ఇతరుల పథకాలను కాపీ కొట్టడమేనన్నారు. రాబోయే రోజుల్లో రెడ్ బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా పేదల కష్టాలు తెలుసుకొని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. కూటమి ప్రభుత్వం గత 14 నెలలుగా దుర్మార్గపు పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.

వైఎస్సార్ పాలన స్వర్ణ యుగం



రాజీవ్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు

పాయకాపురం(విజయవాడరూరల్): మహానేత వైఎస్సార్ పాలన స్వర్ణ యుగమని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 63వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పసుపులేటి యేసు ఆధ్వర్యాన మంగళవారం రాజీవ్‌నగర్‌లో మహానేత వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విష్ణు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, నాయకులు మన్నెం జగదీష్, ఉప్పులేటి రాజు, వాణి, రాజశ్రీ, రమణారెడ్డి పాల్గొన్నారు. అలాగే 62వ డివిజన్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ వీరబాబు, నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మస్తాన్, జస్వంత్ పాల్గొన్నారు. 61వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు నాళం బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆర్ఎస్ నాయుడు, వెంకటేశ్వరరావు, దేవి, కళ్యాణి పాల్గొన్నారు. 64వ డివిజన్ కండ్రికలో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మహానేతకు నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవిరెడ్డి సంజీవరెడ్డి, మేళం చిన్నా, పరిమి నాగేశ్వరరావు, ఎస్కే ఇస్మాయిల్, రావి విమలా, చిన్నారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలుంటే చెప్పండి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమకు చెప్పాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మొగల్రాజపురం, జమ్మి చెట్టు సెంటర్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్, నిర్మల కాన్వెంట్ రోడ్, ఆటోనగర్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ.. నిత్యం ఇళ్ల వద్ద వ్యర్థాలు సేకరణ చేస్తున్నారా, వ్యర్థాలను ఇళ్ల వద్దనే విభజిస్తున్నారా, వారికి తడి చెత్త, పొడి చెత్త, హానికారక వ్యర్థాలను వేరు చేసి ఇమ్మని అవగాహన కల్పిస్తున్నారా అని ఆరా తీశారు. ప్రజలు వీధిలో పడేస్తున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారా, ప్రతి రోజు సైడ్ కాల్వలను, రహదారులను, శుభ్రపరుస్తున్నారా వంటి అంశాలను అడిగారు. తాము వ్యర్థాలు తొలగిస్తున్నప్పటికీ అందుకు తగిన విధంగా వాహనాలు అందుబాటులో లేవని కార్మికులు కమిషనర్‌కు చెప్పటంతో వ్యర్థాలు రవాణా వాహనాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులు, ప్రజా ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన మాన్సూన్ రెస్పాన్స్ టీమ్ అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు వర్షపు నీటి నిల్వలను రోడ్లపై నుంచి తొలగించాలని ఆదేశించారు.

గుర్తింపు కార్డు ఉంటేనే వీధి వ్యాపారానికి అనుమతి

పటమట(విజయవాడతూర్పు): వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డు ఉంటేనే వీధుల్లో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉంటుందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. వీధివిక్రయదారుల చట్టం 2014 ప్రకారం విజయవాడ నగరంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు చేస్తున్న వీధి వ్యాపారస్తులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్లను తీసుకోవాలన్నారు. నగరంలో మెప్మా రిసోర్స్ పర్సన్లు, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శుల ద్వారా సర్వేలో పాల్గొన్న ప్రతి వీధివిక్రయదారులు గుర్తింపు కార్డు వెండింగ్ సర్టిఫికెట్ పొందుటకు రూ.200 చెల్లించాలని చెప్పారు. ఈ రుసుము కమిషనర్ వీఎంసీ టౌన్ వెండింగ్ కమిటీ పేరుతో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ఖాతా నెంబర్. 010101000025000, ఐఎఫ్ఎస్సీ కోడ్: ఐఓబీఏ 0000101కు చెల్లించాలన్నారు. చెల్లింపు రసీదు/చలానా/ కౌంటర్ ఫైల్‌లను, యూపీఐ ద్వారా పేమెంట్ చేయువారు ఫోన్ స్క్రీన్ షాట్ ప్రింట్ కాపీలను వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న యూసీడీ విభాగంలో అందజేయాలని సూచించారు.

తోటివారికి సాయం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని.. భగత్‌సింగ్ స్ఫూర్తితో భగత్‌సింగ్ సేవా సమితి ఏర్పాటు చేసి సేవలు అందించడం అభినందనీయం అని హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు పెనుమత్స సత్యం అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో మంగళవారం భగత్‌సింగ్ సేవా సమితి కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వాంబేకాలనీలోని అమ్మప్రేమ ఆదరణ సమితిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు బాజీ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టైలరు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి నగదు, బంగారం తీసుకుని బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన కందుల దాసుబాబు కుటుంబం జేపీ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటోంది. దాసుబాబు ఓ ప్రైవేటు బ్యాంక్‌లో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తుంటారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె గత కొంత కాలంగా రవితేజ అనే వ్యక్తితో ఎక్కువగా ఫోన్ మాట్లాడుతూ ఉంది. గత నెల 30వ తేదీ సాయంత్రం టైలర్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో బంగారపు వస్తువులు, ఆరు లక్షల నగదు, బంగారపు చైన్ తీసుకుని బయటకు వెళ్లింది. రాత్రి అయినా యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు స్నేహితులు, బంధువుల ఇంట విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



భానూనగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



కండ్రికలో వినాయకునికి పూజలు చేసిన ఏసీపీ స్రవంతి రాయ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే సత్యనారాయణపురం బాబూరావు మేడసెంటర్‌లో గుడిపాటి దత్తు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గురువారం అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు గుడిపాటి దత్తు తెలిపారు. 28వ డివిజన్ భానూనగర్ వినాయక చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జం రవికుమార్ పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.

కండ్రికలో ఏసీపీ పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరిలో స్వామి వారికి మంగళవారం నార్త్ ఏసీపీ డాక్టర్ స్రవంతి రాయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ నిర్వాహకులు కె.రవికుమార్, వరలక్ష్మి దంపతులు, నున్న సీఐ పి.కృష్ణమోహన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



గాయత్రిని జ్ఞాపికతో సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ ట్రెండ్‌సెట్ మెడోస్‌లో వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ట్రెండ్‌సెట్ మెడోస్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. గాయత్రి వీణానాథం, మౌనిక బృందం కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చేసిన కోలాటం, నృత్యాలు చూపరులను ఆనంద పరవశులను చేశాయి. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన గాయత్రి తదితరులకు రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, యర్రంశెట్టి మురళీ, ఉపాధ్యక్షులు కోలా దుర్గాప్రసాద్, బుజ్జి, రామాయణపు రామమూర్తి చేతుల మీదుగా జ్ఞాపికలను ప్రదానం చేశారు.